# సంస్కరణ

ఇందిర డ్యూటీ నించి ఇంటికి రాగానే రోజూ లాగే అడిగింది కూతుర్ని — "ఉత్తరా లేమన్నా వచ్చాయా?" అని.

"సుశీలత్తయ్య రాసింది" అని కూతురు నవ్వుతూ చెప్పింది. సుశీలత్తయ్య ఉత్తరాలంటే తల్లికి ఇష్టమని శశికి తెలుసు.

"ఏం రాసింది? చదివావా? వాళ్ళ ఆవు ఈనిందటనా? లేకపోతే, దాని కూతురు గోరింటాకు పెట్టుకుందా?" అని నవ్వి లోపలికి వెళ్ళింది ఇందిర.

ఇందిరకి సుశీల మేనత్త కూతురు. ఇద్దరిదీ ఒకటే వయసు. బంధుత్వం కన్నా స్నేహం ఎక్కువ ఇద్దరికీ.

సుశీల ఉత్తరం వస్తే ఊళ్ళో సంగతులన్నీ తెలుస్తాయి — బంధువుల కష్టసుఖాలన్నీ తెలుస్తాయి. వాళ్ళ ఆనప్పాదు పిందె లేసిన సంగతి కూడా తెలుస్తుంది.

ఇందిర, బట్టలు మార్చుకుని, కుర్చీలో కూర్చుని ఉత్తరం తెరిచింది. అన్నీ కాలక్షేపం కబుర్లే. వానలు లేక చేలు ఎండిపోతున్నాయని గోల పెట్టేస్తున్నారట ఊళ్ళో వాళ్ళంతా. పెద్దా చిన్నా, ఆడా మొగా అందరూ మొహాలెత్తి ఆకాశం వేపే చూస్తూ ఉండిపోతున్నారట. రాత్రింబవళ్ళూ కప్పల్ని ఊరేగిస్తున్నారట రోజూ. చేల మీద పూజలు చేయించాలని సన్నాహాలు చేస్తున్నారట అందరూ.

"ఇప్పుడేం చేలూ?" అనుకుంది ఇందిర. చేల సంగతి తన కెంతో తెలిసినట్టు!

వానల కోసం సుశీల ఎంత గోల పెడుతూ రాసినా అదేం పట్టలేదు ఇందిరకి. ఉత్తరం నిండా సుశీల మాటలు విన్నందుకే చాలా సంతోషం వేసింది. ఉత్తరం పూర్తి చేసి ఇటూ అటూ తిప్పుతోంటే, ఓ మూల కనపడ్డాయి, ఇంకో నాలుగు ముక్కలు.

"సీతకి పెళ్ళి కుదిరింది తెలుసా? పాపం దాని వయసెంతా? పధ్నాలుగు కూడా నిండలేదు. మా శ్యామల కన్నా చిన్నదే. అరవై ఏళ్ళు దాటిన వాడితో సంబంధం కుదిర్చింది వాళ్ళక్క. సీతని చూస్తే ప్రాణం ఉసూరు మనిపిస్తోంది. అలా రాసిపెట్టి ఉంది గావును దానికి."

ఇందిర ఆ మూల మళ్ళీ మళ్ళీ చదివింది. "సీత ఎవరు? సీత... ఎవరు?" అని గుర్తుతెచ్చుకోడానికి ప్రయత్నించింది. 'సీత' అంటే ఏం తెలుస్తుంది? ఆ పిల్లెవరో రాసి చావకూడదూ ఇది? — అని సుశీలని తిట్టుకుంది.

ఈ రోజుల్లో కూడా ఇంకా ఇలాంటి పెళ్ళిళ్ళేనా? పధ్నాలుగేళ్ళు నిండని పిల్లకి, అరవయ్యేళ్ళు దాటిన వాడితో పెళ్ళా! ... యాభయ్యేళ్ళు తేడా! అబ్బా... తల్చుకోడానికే అసహ్యంగా ఉంది. అసలు ఎందుకా పెళ్ళి?

హరికి చెప్తే గోల పెట్టేస్తాడు.

మళ్ళీ చదివింది ఉత్తరంలో ఆ మూల. "పాపం... పధ్నాలుగేళ్ళు కూడా నిండలేదు. సీతని చూస్తే ప్రాణం ఉసూరు మనిపిస్తోంది. అలా రాసిపెట్టి ఉంది గావును దానికి."

రాసి పెట్టీ ఉండదు, గీసి పెట్టీ ఉండదు. బుద్ధి లేకపోతే సరి!

ఆ అమ్మాయి చెప్పెయ్యరాదూ, ఆ పెళ్ళి చేసుకోననీ?

ఇందిరకి ఏదో అలా అనిపించింది గానీ, ఆ అమ్మాయి మాట ఎంత నెగ్గుతుందో ఇందిరకీ తెలుసు. తను రోజూ ఎన్ని కేసులు చూడ్డం లేదూ? పన్నెండేళ్ళయినా నిండని పిల్లలకి కూడా పెళ్ళిళ్ళు చేసేరు. జబ్బులతోటో, కడుపులతోటో వాళ్ళని ఆస్ప త్రులకు తీసుకొస్తారు. "ఇంత చిన్న పిల్లలకి పెళ్ళి ళ్ళెందుకమ్మా?" అంటే, "ఇంకా చిన్న పిల్లలా?" అన్నట్టు చూస్తారు.

ఆ పిల్ల చేసుకోనంటే వింటారా పెద్ద వాళ్ళు? ఏడ్చే ఉంటుంది ఆ పిల్ల. నోరు మూసుకోమంటారు.

సీత... ఎవరూ? ఇది ఇంకో ముక్కన్నా రాసి చచ్చింది కాదే! ... సరేలే... ఎవరైతే ఏమిటి? ... ఎవరో ఒకరు... పధ్నాలుగేళ్ళకే పెళ్ళి! ... అరవై ఏళ్ళ వాడితో!

... అదీ అసలు ఘోరం! ... వాడికెంత సిగ్గులేదో! ఊళ్ళో వాళ్ళందరూ కలిసి పట్టుకు తన్నాలి! అంత ఘోరం ఎలా జరగనిస్తారో చూస్తూ చూస్తూ!

ఉత్తరం టేబుల్ మీద పెట్టి లేచి వంటింట్లోకి వెళ్ళింది ఇందిర.

శ్రీహరి రాగానే ఇందిర చెప్పలేదు. అతనే చూశాడు. "సీత... ఎవరూ?" అన్నాడు ఉత్తరం పూర్తి చేసి, కంగారుగా.

"ఎవరో... మనకి తెలిసిన వాళ్ళుకాదు. ఎంత ఘోరమో చూడు!"

"ఒకసారి మనం వెళ్ళినప్పుడు, ఒకమ్మాయిని, గోరుచుట్టు మీద కట్టు కాకి తన్నుకు పోయిందని తీసు కొచ్చారు... ఒకటే ఏడుపు ఆ పిల్ల... గుర్తుందా? ఆ అమ్మాయి పేరు సీతే కదా?"

ఇందిరకి కూడా తొందరగానే గుర్తొచ్చింది. "అవును, అవును. ఆ అమ్మాయి పేరు సీతే. దానికి పదేళ్ళు కూడా లేవే!"

"కాదులే. అప్పుడు పన్నెండు ఉంటాయి. ఇప్పుడు పధ్నాలుగన్నమాట! ఆ అమ్మాయికా పెళ్ళి?"

"ఏ అమ్మాయైతే ఏమిటి? పిల్లల జీవితాల్ని వీళ్ళ ఇష్ట మొచ్చినట్టు చేసెయ్యడ మేనా పెద్దవాళ్ళు? ఇలాంటి వాళ్ళని జైళ్ళల్లో పెట్టేలాగ ఏమీ చట్టాలు లేవా?"

"చట్టాలు కావలసినన్ని ఉంటాయి. అసలు పద్దె నిమిదేళ్ళ లోపు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళే చెయ్యకూడదు. అయినా చేసేస్తున్నారు."

"అయితే ఇక చట్టా లెందుకూ?"

"పద్దెనిమిదేళ్ళు దాటినా అరవై ఏళ్ళ వ్యక్తితో పెళ్ళి చేస్తే ఎలాగ? ఇంత వయసు తేడాతో పెళ్ళిళ్ళు జర క్కూడదని చట్టం ఉండాలి.... అసలు పెళ్ళెప్పుడూ?" అంటూ, శ్రీహరి ఉత్తరం మళ్ళీ రెండు మూడుసార్లు తిరగేశాడు. వివరాలు లేవు. "పాపం సుశీల కూడా చాలా బాధపడుతోంది" అన్నాడు.

"ఎవరు మాత్రం బాధపడకుండా ఉంటారు, షష్టిపూర్తి పెళ్ళి కొడుకు తప్ప?"

"ఒకసారి వెళ్దామా? సుశీలా వాళ్ళని చూసి కూడా చాలా రోజులైంది. ఏమన్నా సంగతులు తెలుస్తా యేమో!"

ఇందిరకి హఠాత్తుగా మార్గం తోచినట్టయింది. "అవును హరీ! నాకా ఆలోచనే రాలేదు. వెళ్దాం. నాలు గైంది. పదయ్యేప్పటికి వొచ్చెయ్యొచ్చు, శశీ! తొంద రగా బైల్దేరు" అని ఇందిర కేక పెట్టింది కూతురికి వినపడేలా.

శశి, పుస్తకం చేతిలో పట్టుకుని వస్తూ — "నేను రానమ్మా! రేపు ఎగ్జాముంది. చదువుకోవాలి" అంది జంకుతూ.

"అబ్బా! ఏం చదువే అస్తమానూ? సుశీలత్తయ్యా వాళ్ళింట్లో జామ చెట్టు ఎంత బాగుంటుంది! మర్చి పోయావేమిటి? అక్కడ కూర్చుని జాంకాయలు తింటూ చదువుకోవచ్చులెద్దూ. మేం మాట్లాడుకుంటూ వుంటాం. పుస్తకాలు తెచ్చుకో. సరిపోతుంది."

శశి, ఏదో గుర్తొచ్చినట్టు నవ్వు మొహంతో "వస్తా" అని వెళ్ళింది.

"వంట పని కట్టిపెట్టేద్దాం. సుశీలా వాళ్ళింట్లో చేసుకోవచ్చులే" అంటూ ఇందిర అన్నీ సర్దేసింది.

పావుగంటలో ఇంటికి తాళం పెట్టి బైల్దేరారు. అరగంట కల్లా వాళ్ళ కారు టౌనుని దాటుకుని మట్టి రోడ్డు పట్టింది.

★ ★ ★

అంత హఠాత్తుగా ఇందిరా వాళ్ళని చూసి సుశీల ఆశ్చర్యపోయింది. పొంగిపోయింది. "ఇన్నాళ్ళకి గుర్తొచ్చామా?" అని నిష్ఠురాలాడింది. "చేతిలో కారు పెట్టుకుని కూడా నెలకోసారన్నా రారు" అని కోపం ప్రదర్శించింది.

సుశీలా వాళ్ళాయన కూడా ఇంట్లోనే ఉన్నాడు. "నెలకోసారి రావడానికి వాళ్ళకి ఖాళీ ఏమిటీ?" అన్నాడు నవ్వుతూ.

"అలా చెప్పు శేషూ దానికి" అంటూ ఇందిర లోపలి కొచ్చింది.

శ్రీహరి యాపిల్ పళ్ళ బుట్ట లోపలికి తెస్తోంటే, శేషగిరి అందుకున్నాడు.

"ఇవన్నీ తెస్తారెందుకూ? మా జాంకాయల కన్నా మీ యాపిల్ పళ్ళు గొప్పనుకుంటారా ఏంటి?" అంది సుశీల.

"గొప్పలూ బీదలూ మాకు తెలీవమ్మా! ఆ

బడాయిలన్నీ నీకే" అంది ఇందిర.

వాకిట్లోంచి వెళ్తోంటే "సంపంగి మొక్క కొత్తగా వేశానే ఇందిరా! 'ఇది ఉండ కూడదు, పాములు వస్తాయి' అంటున్నారు అందరూ" అని కొత్త మొక్కని చూపించింది సుశీల.

"ఏడిశార్లే. ప్రతీదానికీ అలాగే అంటారు" అని ఇందిర పట్టనట్టు చూసి లోపలికి వచ్చేసింది.

శశి, సుశీల కూతుర్ని తీసుకుని జామ చెట్టు మీదకి ఎగబాకింది. పుస్తకాలు కార్లోంచి తియ్యనే లేదు.

"అన్నట్టు నా ఉత్తరం అందిందా?" అంది సుశీల గుర్తొచ్చి.

"అది చూసే బైల్దేరాం... సీత ఎవరూ? ఎవరో ఏమిటో రాయకపోతే ఏం తెలుస్తుందే? వెధవ రాతా నువ్వూనూ" అని తిట్టింది ఇందిర.

"పెళ్ళెప్పుడు సుశీలా? అంతా కుదిరిపో యిందా?" అన్నాడు శ్రీహరి కుర్చీలో కూర్చుంటూ.

"ఏమిటి! సీత కబురు చూసే వచ్చారా ఏవిటర్రా? ఇంకా కుదరడం ఏవిటి? నాలుగు రోజులే ఉంది పెళ్ళి. వాళ్ళింటి ముందు పందిరి కూడా వేస్తున్నా రన్నారు పిల్లలు పొద్దున్న. ఈ పాటికి వేసేసే ఉంటారు ... ఇందిరా! జయమ్మ తెలీదూ నీకు? ... తెల్లగా ఎత్తుగా ఉంటుందీ... కాంతమ్మ గా రమ్మాయి. దాని చెల్లెలే సీత."

ఇందిరకి... చాలా దూరంగా... కాంతమ్మా... పాపారావూ... జయలక్ష్మీ... ఆ పేర్లేవో గుర్తొచ్చాయి. "జయమ్మ చెల్లెలా?" అంది జ్ఞాపకాల్లోంచి బయట పడుతూ.

"అంత పెద్ద వాడితో ఎందుకు చేస్తు న్నారు? ఈ రోజుల్లో ఎవరన్నా అలా చేస్తున్నారా?"

"ఏమో, రకరకాలుగా చెప్పుకుంటు న్నారు. జయమ్మా వాళ్ళకి పాతిక వేలో ఎంతో ఇస్తానన్నాడట అతను. నిజమో అబద్ధమో మరి. పెళ్ళి కుదుర్చుకున్న నాడు ఒక చంద్రహారం గొలుసు పెట్టారట పిల్లకి. ఆ గొలుసు జయమ్మ వేసుకుని తిరుగు తోంది."

"సీత అమ్మా నాన్నా ఎందుకు ఒప్పు కున్నారు ఈ పెళ్ళికి?"

"అమ్మ ఎక్కడుందే! పదేళ్ళ కిందటే పోయింది. అప్పట్నించీ ఈ పిల్ల అక్క గారిం ట్లోనే. తండ్రి ఉన్నాడు గానీ ఉత్త గాలి మనిషి. స్థిరం లేదు. పనీ పాటా చెయ్యడు. పైగా ఒక్క రూపాయి డబ్బులుంటే పేకా టలో కూర్చుంటాడు..."

శేషగిరి అందుకుని — "ఈ ఒక్క రూపాయి నన్నేం ఉద్ధరిస్తుంది. ఇది ఉంటే ఏమిటి, ఊడితే ఏమిటి — అను కుంటాడు" అన్నాడు.

"ఒక్క రూపాయే కాదు. పది రూపా యలున్నా అలాగే అనుకుంటాడు. ఇవి నన్నేం ఉద్ధరిస్తాయి — అనుకుంటాడు" అంది సుశీల.

"పేకాటలో ఒక 'లక్ష' రూపాయలు వచ్చాక, ఇక మళ్ళీ వెళ్ళకుండా వాటిని దాచుకుంటాడేమో!" అన్నాడు శ్రీహరి.

"ఆ రకం మనిషేలే పాపారావు మావయ్య. జయమ్మ ఇంట్లోనే తిండి. రోజా పోట్లాటలే. కొన్నాళ్ళు ఎటెటో పోతాడు. ఎప్పుడో హఠాత్తుగా వస్తాడు. వాళ్ళు వొంగనివ్వడు. అలాంటి వాడేం పట్టించుకుంటాడు కూతురు గురించి?"

ఇందిరకి చాలా జాలేసింది ఆ పిల్ల మీద. "మరి ఎలాగే పాపం? తల్లి లేదు. తండ్రి పట్టించుకోడు. అక్క అర్థం చేసు కోదు. ఆ పిల్ల సంగతి ఏం కావాలి?"

"ఇంకేం కావాలి? పెళ్ళవుతుంది. కాప రాని కెళ్తుంది. ఆ పెళ్ళి కొడుక్కి వండి పెడుతూ ఉంటుంది."

"అతని పేరేమిటి? పిల్ల లున్నారా? బాగా డబ్బున్న వాడా?"

"బాగా ఏం కాదు గానీ, ఏదో ఉంది. ఇల్లూ, వాకిలీ ఉంది" — సుశీల, శేషగిరిని చూస్తూ "రాజ య్యకి ఎంత పొలం ఉంటుంది?" అని అడిగింది.

"ఉంటుందేమో పదెకరాలు" అన్నాడు శేషు.

ఇంకా ఇందిర అడిగినవన్నీ సుశీల చెపుతోంది. "రాజయ్యకి ఇద్దరు కొడు కులూ, ఇద్దరు కూతుళ్ళూ. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. కొడుకులు వేరే కాపరా లుంటున్నారు, ఆ ఇంట్లోనే. ఇప్పుడు రాజ య్యకి తిండీ తిప్పలూ కుదరడం లేదట! కుదురైన పిల్ల కావాలట!"

శ్రీహరికి కంపరంగా అనిపించింది వింటోంటే. "వండి పెట్టే వాళ్ళే దొరకరా ఊళ్ళో? తిండికి జరగని

పెద్ద వయసు ఆడవాళ్ళు బోలెడు మంది ఉంటారు. ఎవరి కన్నా మంచి జీతం ఇచ్చి పెట్టుకోవచ్చు. వంట కోసం పధ్నాలుగేళ్ళ పిల్లతో పెళ్ళికి దిగుతాడా దరిద్రుడు! నరకాలి పట్టుకుని!" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

"అతని పిల్లలెందుకు ఒప్పుకుంటున్నారు ఈ పెళ్ళికి?" అంది ఇందిర.

"మనకేం తెలుసే? వాళ్ళు పోట్లాడే ఉంటారు. లేకపోతే, 'సరే పోనియ్యి, పెళ్ళి చేసుకుంటే మాత్రం ఇప్పుడు పిల్లలు పుట్ట బోతారా, ఆస్తి పంచుకోబోతారా' అనుకున్నారేమో! అతను ఉన్నన్నాళ్ళూ సంరక్షణ చేస్తుందిగా? ఆ బాధ మనకి తప్పుతుందిలే — అనుకున్నారేమో! ఏం చచ్చారో ఎవరికి తెలుసు?" అంది సుశీల కోపంగా.

ఎంతసేపు మాట్లాడినా ఆ మాటలే మళ్ళీ మళ్ళీ మాట్లాడుకున్నారు.

ఇందిర చాలా నిరుత్సాహపడి పోయింది.

వాళ్ళతో మాట్లాడుతూనే సుశీల వంటింట్లో ఏవో వంటలు ప్రారంభించింది. "జయమ్మకి ఎంత సిగ్గు లేదోనే ఇందిరా! ఆ గొలుసు వేసుకుని తిరుగుతోంటే, ఎవళ్ళో వేళాకోళంగా అన్నారట! 'పాపం సీతకి మొగుడితో ముచ్చటెలాగా ఉండదు. గొలుసుతోటేగా ముచ్చటంతా. ఆ గొలుసు దాని మెళ్ళోనే వెయ్యరాదూ?' అన్నారట. ఆ మాటలకి జయమ్మ ఉడుక్కుని — 'రేపట్నించీ అదే వేసుకుంటుందిగా' అందట. అందాకా, ఇది షోకు చేసుకుంటుంది గావును, బుద్ధిలేని మనిషి!" అని తిట్టింది సుశీల.

ఆ మాటలేవీ ఇందిరా, శ్రీహరీ పట్టించుకోలేదు.

"ఎంత వయసుంటుంది జయమ్మకి?"

"ఉంటాయి ముప్పయ్యేళ్ళు' మనకన్నా చాలా చిన్నది. ఐదుగురు పిల్లలు. చేతికీ మూతికీ అందని సంసారం. ఏవిటో పాపం, దాని బాధ దానిది" అని మళ్ళీ, సుశీలే జయమ్మని తల్చుకుని జాలిపడింది.

"సీతా వాళ్ళ నాన్నతో మాట్లాడితే ఎలా ఉంటుంది సుశీలా?" అన్నాడు శ్రీహరి.

శేషగిరి అందుకుని — "ఆయనెక్కడున్నాడండీ? నెల్లాళ్ళ నించీ ఊళ్ళో లేడు. ఎటు పోయాడో!" అని, ఆయన ఎలా కనపడి, ఎలా మాయమయ్యాడో వర్ణించాడు.

"అయితే పెళ్ళిమాట ఆయనకి తెలీదా? వస్తే గొడవ పెట్టడూ కూతురికి ఇలాంటి పెళ్ళి చేశారనీ?" అని ఆశ్చర్యపోయింది ఇందిర.

"ఆయన మాటెవరు పట్టించుకుంటారే? అర్థం చేసుకోవేం? ఇంటికి రాగానే పెళ్ళి సంగతి విని, సుఖంగా తిండి పెట్టే అల్లుడు దొరికాడని చాలా సంతోషిస్తాడేమో, ఎవరికి తెలుసు?"

"అల్లుడు కూడా పేకాడతాడా?" అన్నాడు శ్రీహరి.

శేషగిరి వెంటనే — "నిజమే నండోయ్, అల్లుడు కూడా పేకాట రాయుడే. మామా అల్లుళ్ళకి చాలా బాగుంటుంది ఈ సంబంధం. డబ్బులు ఎక్కడికీ పోవు" అని నవ్వాడు.

ఇందిరకి చాలా చిరాకేసింది. "ఏవిటి శేషూ, మీ హాస్యాలూ మీరూనూ! దానికేం సమయం సందర్భం ఉండక్కర్లేదా?" అని మొహం చిట్లించింది.

శేషగిరి, తప్పయినట్టు కొంచెం నవ్వి సిగ్గుపడి ఊరుకున్నాడు.

సీత విషయం ఇందిరకి చాలా బాధగా ఉందని సుశీలకి అర్థమైంది. "మరేం చేద్దామే ఇందిరా, చెప్పు" అంటూ సుశీల ఇందిరని శాంతపరచడానికి ప్రయత్నించింది. "సీత నాన్న గోల ఎందుకుగానీ, మాట్లాడితే జయమ్మతోటే మాట్లాడాలి" అని, శేషగిరిని చూస్తూ — "జయమ్మా వాళ్ళాయన పొలంనించి వొచ్చాడో లేదో కొంచెం చూస్తే?" అంది.

"ఇందాక కనపడ్డాడు. ఇంటి దగ్గరే ఉన్నాడు. పందిరి పనేదో చేస్తున్నారు" అన్నాడు శేషగిరి.

ఇందిరకి కొంచెం మార్గం కనపడింది.

"అవునే సుశీలా, ఒకసారి వెళ్తే? సీతని చూడ్డానికి వెళ్ళినట్టు వెళ్దాం, జయమ్మ ఏం మాట్లాడుతుందో చూద్దాం" అంటూ లేచించి ఇందిర.

'ఏదో చెయ్యాలి' అన్నట్టు శ్రీహరి కూడా ఉత్సాహంగా లేచాడు. "అసలు జయమ్మతోటే మాట్లాడాలి. పెళ్ళి కుదిరిపోతే మాత్రం? పీటల మీద పెళ్ళిళ్ళే తప్పిపోతూ ఉంటాయి!" అన్నాడు.

ఇందిర చెప్పులేసుకుంటూ "సుశీలా! ఆ పళ్ళు కాసిన్ని తియ్యి. పట్టుకెళదాం" అంది.

"కాసిన్నేమిటి? బోలెడు మంది పిల్లలున్నారు

వాళ్ళకి" అంటూ సుశీల మూడొంతుల పళ్ళు గుడ్డ సంచిలో వేసి పట్టుకుంది. "మిమ్మల్ని దిగబెట్టి వచ్చేస్తాను నేను. మీరు నెమ్మదిగా మాట్లాడి రండి. నేనుంటే బాగుండదు... కారు వొద్దు. నడిచివెళ్దాం. దగ్గిరే."

వాళ్ళు బైల్దేరేప్పటికి ఏడు దాటింది. వీథంతా చీకటి చీకటిగా ఉంది.

★ ★ ★

అప్పటిదాకా కారు చుట్టూ మూగి ఉన్న పిల్లలు, ఎప్పుడో చెప్పేశారు జయమ్మా వాళ్ళింటికి పరిగెత్తుకు పోయి — "మీ ఇంటికి వాళ్ళెవరో వచ్చేస్తున్నారు శేషగిరోళ్ళింటికి కారుమీద వచ్చారే వాళ్ళూ! వస్తున్నారు మీ ఇంటికి" అని కేకల్తో చెప్పేశారు.

కొత్త పందిట్లో చేరిన పిల్లలు కూడా వాళ్ళతో కలిసి అందరూ చోద్యం చూడ్డానికి సిద్ధంగా వసారా నిండా గుమిగూడి నిలబడ్డారు.

పిల్లలు మోసుకొచ్చిన వార్తకి జయమ్మ కంగారు పడిపోయింది. మంచాలూ, తట్టలూ, బట్టలూ ఇటూ అటూ సర్దడం మొదలెట్టింది. "వీళ్ళేదో వాగుతున్నారు. ఎవరొస్తున్నారో చూడూ" అని గేదెలకి మేత వేస్తోన్న మొగుడికి వినపడేలాగ అరిచింది.

వెంకన్న వసారాలోంచి పందిట్లోకి వెళ్ళేప్పటికే సుశీల ఎదురొచ్చింది. ఆమె వెనకాల ఇందిరా, శ్రీహరీ పందిట్లో ఆగారు. ఆ పూటే కొత్త తాటాకులతో కుట్టారు పందిరి. పచ్చి వాసనతో చల్లగా ఉంది. ఇంకా ఒక పక్కన చాలా తాటాకు బడిపి పెట్టి ఉంచారు.

సుశీల, వసారాలోకి పోతూ — "జయమ్మా! మా ఇందిర వొదినా వాళ్ళు వచ్చారే! సీతకి పెళ్ళని ... ఒకసారి చూద్దామంటే తీసుకొచ్చా. మళ్ళీ కాస్సేపటికి వెళ్ళిపోతారు కదా? మీరేదో అడావిళ్ళో ఉన్నట్టున్నారు" అంది. సుశీల కళ్ళు జయమ్మ మెడమీదే ఉన్నాయి. మెడలో ఆ గొలుసు లేదు.

జయమ్మకి కొంచెం భయం తగ్గింది.

"మీ ఇందిర వొదినా వాళ్ళా? ... పాడు పిల్లలు ..... ఎవరో అనుకున్నా" అంటూ జయమ్మ నవ్వు మొహంతో ఆహ్వానించింది.

సుశీల జయమ్మకి శ్రీహరిని చూపిస్తూ "మా శ్రీహరి అన్నయ్య! ఇందిరా వాళ్ళాయన. వీళ్ళిద్దరూ డాక్టర్లే. తెలుసుగా నీకూ?" అని, 'డాక్టర్లు' అనే మాట కావాలనే గుర్తు చేసింది. వాళ్ళు చెప్పే మాటలకి ఏమన్నా విలువిస్తుందేమోనని.

జయమ్మ సిగ్గుపడిపోతూ, కంగారు పడుతూ, కంఠం పెగుల్చుకుని "కూర్చోండి" అని బల్ల చేతితో దులిపింది.

ఇందిర కళ్ళు, పందిట్లోకి వచ్చినప్పటి నించీ 'సీత' కోసం వెతుకుతున్నాయి, చుట్టూ పది పదిహేను మంది పిల్లలు దడి కట్టేశారు. అందులో ఎవరో ఏమిటో! ... అంతా మసక మసకగా ఉంది. నలభై కాండిల్ బల్బు, అదీ నల్లరంగు వేసినట్టు పొగచూరి పోయి ఉంది. వసారాలో రెండో పక్క గేదెల్ని కట్టేశారు.

శ్రీహరి బల్లమీద కూర్చున్నాడు. ఇందిర కూడా కూర్చుంది.

సుశీల పళ్ళసంచి లోపల గుమ్మంలో పెడుతూ — "వెళ్తానే జయమ్మా! వంట చెయ్యాలి. మళ్ళీ వాళ్ళు వెళ్ళాలిగా" అని కదలబోయింది.

"మా ఇంట్లో తినకూడదా? నేను చేస్తాలే. ఇక్కడ తినేసి వస్తార్లే" అంది జయమ్మ సిగ్గు సిగ్గుగా.

"ఈ పిల్లలతో, ఇంత రాత్రిపూట నీకేం తెములుతుందిగానీ... ఇంకో సారెప్పుడన్నా తింటార్లే మీ ఇంట్లో. ఏదీ, సీత కనపడదేం? దాన్ని చూద్దామనే వచ్చారు" అంటూ సుశీల ఇటూ అటూ చూసింది. పిల్లలందర్నీ ఆ చీకట్లో — "వీళ్ళందరూ ఇలా మూగారేంటీ? ఏం చూస్తారర్రా ఇక్కడా? ఎవరిళ్ళకి చుట్టాలొచ్చినా మీరే ఉండాలా వాళ్ళ చుట్టూ? ... పొండి... వెళ్ళండి... వాళ్ళని కాస్త గాలి పీల్చుకోనిస్తారా లేదా? వెళ్ళండి" అని కేకలేసి కొందర్ని వెళ్ళగొట్టింది.

మిగతా పని వెంకన్న పూర్తి చేశాడు. ఇంకా ఈ మూలా ఆ మూలా నక్కిన ఒకళ్ళిద్దరికి మొట్టికాయలు కూడా తగిలించి, "ఎళ్ళండి... అన్నాలు తినరా?... ఊఁ ... నడుస్తారా లేదా" అని పెద్ద పెద్ద హుంకరింపులు చేసి మొత్తానికి అందర్నీ తోలేసి వసారాలోకి వచ్చాడు.

పెద్ద వాన కురిసి వెలిసినట్టయింది.

జయమ్మ, ఇందిరా వాళ్ళ ముందు నేలమీద, గోడ వార కూర్చుంది.

సీత, ఇందిర దగ్గిర బల్ల చివర తలవంచుకుని కూర్చుంది.

జయమ్మ పిల్లలు ముగ్గురో నలుగురో అక్క డక్కడా తచ్చాడుతున్నారు. వేలు చీకుతోన్న చంటి పిల్లవాణ్ణి ఒక పెద్ద పిల్ల చంకనేసుకుని తిరుగుతోంది. ఇంకో చిన్న పిల్ల కూడా గౌను ఎత్తి గుప్పెట్లో పట్టుకుని రెండు వేళ్ళూ నోట్లో పెట్టుకుని చీకుతోంది.

డాక్టర్ ఇందిర కళ్ళకి, ఆ పిల్ల లందరిలోనూ అంత చీకట్లోనూ 'మాల్ న్యూట్రిషన్' కనపడింది. అయినా ఇందిర ధ్యాస ఆ విషయాల మీద ఎంతో సేపు నిలబడలేదు. "జయమ్మా! ఇక పిల్లల్ని కనడం కట్టిపెట్టు. నా దగ్గిరికి రా. కాణీ ఖర్చు లేకుండా ఆప రేషన్ చేస్తాను" అనలేదు.

సీతనే చూస్తోంది తదేకంగా. చూస్తోన్న కొద్దీ "ఎంత కుదురుగా ఉందో!" అనిపిస్తోంది.

సీత, చిన్న చిన్న పూల పరికిణీ, చిన్న వోణీ. చేతి ముందు అంచున్న జాకెట్టు. రెండేసి మట్టి గాజులు. చిన్న చిన్న దుద్దులు. మెడలో ఏమీ లేవు. తల చెరిగి ఉంది. ఒక్క జడ, కొంచెం నలుపు. మొహం ఎంత కళగా ఉందో!

సీత వీపు వెనక, సీతని ఆనుకుని నించుంది జయమ్మ పెద్ద కూతురు. పన్నెండేళ్ళుంటాయి.

ఇందిర, సీత మొహం మీద నించి ఆ పిల్ల మొహం మీదకి చూసింది, సీత పోలికలే. సీత చెల్లెల్లా ఉంది. బాగా రంగు. వోణీ లేదు. చేతులకి మట్టి గాజులు కూడా లేవు. రెండు చేతులకీ గోరింటాకు పెట్టుకుని ఉంది.

"నీ పేరేంటి?" అంది ఇందిర నెమ్మదిగా ఆ పిల్లతో.

అది సిగ్గుపడిపోతూ వెనక్కి జరిగి "సావిత్రి" అని గొణిగింది.

దాని పక్కనే మిగతా ఇద్దరు ఆడపిల్లలూ చేరారు. అందరూ ఒకటే పోలికలు. ముత్యాల్లా ఉన్నారు.

వాళ్ళల్లో ఒకర్ని అడిగింది ఇందిర — "నీ పేరేవిట"ని.

అది, పూర్తిగా అక్క వీపు వెనక నక్కబోతే సావిత్రి దాన్ని బైటికి గెంటి, "దీని పేరు స్వాతి. దాని పేరేమో రేవతి" అని సావిత్రే చెల్లెళ్ళ పేర్లు చెప్పింది.

రేవతే, రెండు వేళ్ళూ నోట్లో పెట్టుకుని చీకుతోన్న పిల్ల.

ఇందిర ముక్కు మీద వేలు పెట్టుకుని, "తప్పు" అన్నట్టు చూపిస్తూ — దాని నోట్లోంచి చెయ్యి తీసేసి "అలా పెట్టుకోకూడదమ్మా. కడుపులోకి మురికి పోతుంది. జబ్బు లొస్తాయి. నీ పళ్ళు ఎత్తుగా అయి పోతాయి. ఏం, ఇంకెప్పుడూ పెట్టుకోకేం?" అని చెయ్యి అలాగే పట్టుకుంది.

అది, చెయ్యి లాక్కుని, సీత వెనకాలకి జరిగి, అక్కణ్ణించి పారిపోయింది.

సీతని ఒరుసుకుని నించున్న స్వాతిని చూస్తూ ఇందిర — "మీ అక్క గోరింటాకు పెట్టుకుంది. మీ రెందుకు పెట్టుకోలేదూ?" అంది.

"ఆడుకోవాలని కడిగేసుకున్నాం. మా అక్క బాగా పండాలని ఇంకా ఉంచుకుంది. మరేమో ..... బాగా పండితే ..... మంచి మొగుడొస్తాడంట!" అని ఇకి లించింది అది.

సావిత్రి చెల్లెల్ని రోషంగా గెంటి — "నేనలా అన్నానా?" అని కళ్ళురుమి చూసింది.

"అనలేదామ్మా నువ్వు ఇందాకా?" అని స్వాతి రెట్టించింది.

ఆ గందరగోళంలో స్వాతి చంకలో పిల్లాడు ఏడుపు లంకించుకున్నాడు.

పిల్లలకి అన్నాల వేళ దాటిపోయింది.

"సీతా! లేచి శాయికి కొంచెం అన్నం పెట్టవే" అంది జయమ్మ.

ఆ మాటలు పూర్తి కాకుండానే లేచిపోయింది సీత. లోపలికి వెళ్ళి గిన్నితో అన్నం కలిపి తెచ్చింది. పిల్లాణ్ణి చంక నేసుకుని అన్నం తినిపిస్తూ గేదెల వేపు తీసుకెళ్ళింది. అట్నుంచీ వంటింట్లోకి తీసికెళ్ళింది.

జయమ్మ సావిత్రితో కోపంగా "చేతులు కడుక్కో, ఇంక చాలుగానీ. పిల్లలకి అన్నాలు పెట్టు. రమణ నిద్రకి పడ్డాడు చూడు" అని అరిచింది.

సావిత్రి ఎటో పరిగెత్తి చేతులు కడుక్కుని వచ్చింది.

"ఏదీ చూపించూ!" అని చెల్లెళ్ళు దాని చేతుల కోసం ఎగబడ్డారు.

సావిత్రి కోపంగా వాళ్ళని విదిలించేసి, "కూర్చోండి. అన్నాలు పెడతాను. రమణని లేపు" అని ఆ పని ఒక చెల్లెలికి పురమాయించి లోపలికి

పోయింది.

అప్పటికి పావుగంట దాటింది ఇందిరా వాళ్ళు వచ్చి. పెద్ద వాళ్ళ మధ్య ఒక్క మాట కూడా జరగలేదు.

"మంచినీళ్ళు పుచ్చుకుంటారా?" అని జయమ్మ లేవబోయింది.

"వద్దులే జయమ్మా, కూర్చో..." అని ఇందిర ఇక ప్రారంభించక తప్పదన్నట్టు "సీతకి సంబంధం కుదిరి పోయినట్టేనా?" అని ఎత్తుకుంది.

జయమ్మ కొంచెం జంకుతూనే — "ఇంకా కుదరడం ఏంటండీ? నాలుగు రోజులే ఉంది పెళ్ళి. ఇవ్వాళే పందిరేశారు!..." అని ఆగింది,

"అంత పెద్దాయన కిచ్చి చేస్తున్నారేవిటి? చిన్న పిల్ల కదా?" అని అసలు సంగతి ఎత్తింది ఇందిర.

"మరీ పెద్దాయన కాదండీ. యాభయ్యేళ్ళుంటా యేమో. దీనికీ పదహారు వుంటాయి" అంది జయమ్మ గబగబా.

"అలా అయినా ముప్పయ్యేళ్ళకి పైగానే తేడా వుంటుంది కదమ్మా! ఈ కాలంలో ఎవరు చేస్తున్నారి లాగ? పిల్ల, బతికి నన్నాళ్ళూ ఉసూరుమని ఏడుస్తుంది కదా? మీ నాన్న కూడా ఒప్పుకున్నాడా?"

"అయ్యో, ఆయనే ఉంటే ఇస్త రెందుకనీ, మా నాన్నకి అంత తీరువుంటే, మా బతుకు లిలాగెందు కవుతాయండీ? ఆయన ఏమీ పట్టించుకోడు. మా అమ్మ పోయిం దగ్గిర్నించీ దీని మంచీ చెడ్డా నేనే చూస్తున్నాను. నాకు పుట్టెడు మంది పిల్లలు. ఎకరన్నర పొలం మీద ఇంత మంది బతుక్కొస్తున్నాం. ఏదో పల్లెటూరు కాబట్టి, పాలమ్ముకునీ, పెరుగమ్ముకునీ, ఎలాగో కాలక్షేపం చేస్తున్నాం. ఇంక పెళ్ళిళ్ళు కూడా ఏం బెట్టి చేస్తాం? పడుచు వాళ్ళు కావాలంటే ఎంత పనికిమాలిన వాడికైనా వేలు పొయ్యాలి, వేలు! ఆ మధ్య ఒక సంబంధం చూశాం. పాలేరు పని చేస్తు న్నాడు. సైకిలూ, వాచీ, ఉంగరం, బట్టలూ, అత్తకి బట్టలూ, మావకి బట్టలూ, అన్నీగాక పదివేలడిగారు. నమ్ముతారా? ఎక్కడ తేవాలమ్మా? ఈ లెక్కన ఎన్ని పెళ్ళిళ్ళు చేస్తాం? ఈ పిల్లలందర్నీ ఏం చెయ్యాలి? గోదాట్లోకి తొయ్యాలి" జయమ్మ చెప్పుకుపోతోంది.

ఇందిర తల వాలేసి వింటోంది.

"రాజయ్యగారు మనిషితో అడిగించారు. ఆయన చేసుకోవాలంటే 'కో' అంటే కోటిమంది పిల్లలున్నారు. మన పిల్ల కుదురైందని ఊళ్ళో అందరికీ తెలుసు! వాళ్ళే కాళ్ళ దగ్గిరికి వచ్చారు. ఎందుకు కాదనాలి చెప్పండి? తిండికీ, బట్టకీ కరు వుండదు. కడుపునిండా తింటుంది. ఒంటి నిండా కట్టుకుంటుంది. ముక్కుకీ, మూతికీ పెట్టుకుంటుంది. నాబోటి వాళ్ళకి నలుగురికి పడేస్తుంది. కష్టానికీ సుఖానికీ అప్పా చెల్లెళ్ళం. ఒక్క ఊళ్ళోపడి ఉంటాం. మాకేం అమ్మా, అబ్బా? ఎవరు న్నారు? ఒకళ్ళకొకళ్ళం ఆధారం. అన్నీ ఆలోచించే సరేనన్నాను. తప్పో... ఒప్పో... పడుచువాడు కావా లంటే ఊరికే వస్తాడామ్మా? పిల్ల గుణ గణాలు చూసి కళ్ళకద్దుకుని చేసుకోవచ్చు. ఒక్క ముండా కొడుకన్నా చేసుకుంటాడా? ... నేను పడుచువాణ్ణే చేసుకున్నాను. ఏం సుఖపడిపోతున్నాను?" — జయమ్మ గబగబా మాటలు దూసి పోసేస్తోంది.

ఇందిర అడ్డుపడి — "నీకు ముత్యాల్లాగ నలు గురు పిల్లలు పుట్టారు. మరి దాని మాట?" అంది చనువుగా అన్నట్టు.

"దానికీ పుడతారు. గీతలో రాసిపెట్టి వుంటే పిల్లలకేం భాగ్యం? పోనీ మీరన్నట్టే పిల్లలు పుట్టకపోతే నా పిల్లాణ్ణి ఇచ్చేస్తాను. నా దగ్గిర ఉంటే వొకటీ, దాని దగ్గిర ఉంటే వొకటీనా?"

శ్రీహరి అందుకున్నాడు. "మీరన్నదంతా నిజవే నండీ. బోలెడు బోలెడు కట్నాలడుగుతున్నారు. అదంతా నిజమే. అలా అని చూస్తూ చూస్తూ చిన్న పిల్లని అంత పెద్దవాడితో పెళ్ళి చేస్తామా? పోనీ కొంత కాలం ఆగండి. అంత కంగారేమొచ్చింది? కొన్నాళ్ళా గితే ఏదన్నా మంచి సంబంధం దొరక్కపోదు."

"ఏవిటీ! మూణ్రోజుల్లో కొచ్చిన మూర్తం ఆపె య్యాలా?" అని జయమ్మా, వెంకన్నా నిర్ఘాంత పోయారు. ఈ మాట చెప్పడానికేనా వీళ్ళు ఇంత పనిగట్టుకుని వచ్చిందీ — అన్నట్టు తెల్లబోయారు. "తర్వాత మంచి సంబంధం దొరుకుతుందా? ఎంత మంచి సంబంధం అయితే, అంత కట్నాలూ పెరుగు తాయండీ. మేమైతే వెయ్యి రూపాయలు కూడా ఖర్చు పెట్టలేం. ఇప్పుడు చెయ్యకపోతే ఈ సంబంధం కూడా పోతుంది. రెంటికీ చెడ్డ రేవళ్ళం అవ్వాలి. మా పిల్లలూ ఎదుక్కొస్తున్నారు. రోజురోజుకీ రోజులు పాడై

పోతున్నాయిగానీ, బాగు పట్టం కనపడటం లేదు. నా పెళ్ళప్పుడు ఒక్క కానీ కట్నం ఇవ్వలేదు. పిల్లే చాలని చేసుకున్నారు. ఇప్పుడు అలా ఉందా కాలం?....” మాట్లాడుతూ మాట్లాడుతూ జయమ్మ ఏడవడం మొదలుపెట్టింది. పైట కొంగుతో కళ్ళూ ముక్కూ తుడుచుకుంటూ మాట్లాడింది.

“పిల్ల బతుకు నాశనం చేస్తున్నానని నాకు కడుపులో బెదురుగానే ఉందండీ. నలుగురూ నన్నే దుయ్యబడుతున్నారు. సంబంధం కుదుర్చుకున్న రోజున పిల్లకి రాజయ్య గారు చంద్రహారం గొలుసూ, పట్టు చీరా పెట్టారు. బుద్ధిలేని దాన్ని, ఆ గొలుసు నాలుగు రోజులు నా మెళ్ళో తగిలించుకున్నాను. ఆ గొలుసు కోసమే ఈ సంబంధం కుదిర్చాననీ. నా పిల్లల్ని పెంపకం ఇవ్వడానికే కుదిర్చాననీ... నా మీద ఇన్ని చెప్పుకుంటున్నారు” అని జయమ్మ మధ్యలో నెత్తిమీద జుట్టు పట్టుకుని చూపించింది. “నేనూ పిల్లల్ని కన్న దాన్నే. నాకూ కష్టం, సుఖం తెలుసు. నన్నేం చెయ్యమంటారో చెప్పండి. ఇప్పుడీ సంబంధం కాదనుకుంటే, మళ్ళీ దానికి పెళ్ళెలా చెయ్యగలం? వీళ్ళెవరన్నా నిలబడి చేస్తారా చెప్పండి?”

అంతదాకా కలగజేసుకోకుండా మౌనంగా ఉన్న వెంకన్న, భార్యని మందలిస్తున్నట్టు — “అదేం మాట? మన పిల్ల పెళ్ళి ఎవళ్ళో వచ్చి ఎందుకు చేస్తారు? మన బాధేదో మనం పడాలిగానీ...” అన్నాడు.

జయమ్మ నోరు జారి తప్పుమాట అనేసినట్టు తలవాలేసి ఊరుకుంది.

ఇందిరకి నోటమాట రాలేదు. ‘ఈ మనుషులనేం తప్పుపడతాం?’ అనిపించడం ప్రారంభమైంది. ‘ఇలాంటి పరి స్థితిలో ఉంటే మనం మాత్రం ఏం చేస్తాం?’ అనిపించింది కూడా.

“వీళ్ళెవరన్నా నిలబడి చేస్తారా?” అంటోంది జయమ్మ. “అంతే కదా మరీ?” అనిపించింది ఇందిరకి, మళ్ళీ మళ్ళీ.

శ్రీహరి కూడా ఆ మాటలు గ్రహించాడు. అతను ఇందిరతో పైకే అన్నాడు. “ఊరికే సలహాలిస్తే ఏం లాభం? ఏదన్నా సహాయం చెయ్యడానికి సిద్ధపడాలి, లేకపోతే అంతా కాలక్షేపం మాటలైపోతాయి.”

ఇందిరకి అర్థమైంది. ఒక్కసారిగా ఇబ్బందిలోంచి బయటపడి పోయినట్టయింది, సీత పెళ్ళి ఆగిపోయినట్టే అనుకుంది. “జయమ్మా! సీత పెళ్ళి పూచీ అంతా మాదే! పెళ్ళికోసం ఎంతయినా సరే, మేం పెట్టుకుంటాం. ఈడూ జోడూ కుదిరిన సంబంధం ఉండాలి. ఈ సంబంధం వద్దు. పిల్ల జీవితం నాశనమైపోతుంది” — ఆ మాటలు చెప్తోన్నంత సేపూ ఇందిర పొంగిపోయింది.

శ్రీహరి పెద్ద ఇబ్బందిలో పడిపోయినట్టు చూశాడు ఇందిరని — “మొగాళ్ళు ఎంతెంత కట్నాలడిగినా, ఎన్నెన్ని లాంఛనాలడిగినా అవన్నీ ఇచ్చి పెళ్ళి చేస్తామా? అదేం పద్ధతి? కట్నాలివ్వడం మనకు నచ్చదు. రేపు మనం మాత్రం ఎలా చేస్తాం?” అన్నాడు ఆశ్చర్యపోతూ.

“మరెలాగ? ఇంకెలా సహాయం చేస్తాం?” అని ఇందిర ఇంకా ఆశ్చర్యపోయింది.

వాళ్ళిద్దరూ ఏమనుకుంటున్నారో జయమ్మకీ, వెంకన్నకీ అంతుపట్టలేదు. ‘ఈ సంబంధం మానెయ్యమంటున్నార’ని మాత్రమే వాళ్ళకి అర్థమయ్యింది.

నాలుగు రోజుల్లో ముహూర్తం ఉంటే ఇప్పుడు అన్నీ మానెయ్యాలా వీళ్ళొచ్చి చెప్పారని! రేపు వీళ్ళేదో ఇస్తారని! గుమ్మం ముందు పెళ్ళి పందిరి కూడా వేసేశాక!

వెంకన్నకి ఒళ్ళు మండిపోయింది — “అలా కుదరదు లెండి. మీరేదో పిల్లమీద ప్రేమతో చెపుతున్నారు గానీ, ఇంతదాకా వచ్చాక మానుకోటం కుదరదు లెండి. తప్పో ఒప్పో అనుకున్నట్టు అయిపోవాలి. మాటంటే మాటే!”

తర్వాత జయమ్మ అందుకుంది — “లోకులు కాకులు. ఇప్పుడు మానుకుంటే, మొదట ఎందుకు కుదుర్చుకోవాలీ — అంటారు. చేసినా తప్పు పడతారు, మానినా తప్పు పడతారు.”

ఇందిరకి అంతా అయోమయం అయిపోయింది. ‘ఖర్చంతా మేమే పెట్టుకుంటాం’ అన్నా వినకపోతే ఎలాగ? ‘కుదరదు, కుదరదు’ అంటారేమిటి? “వీళ్ళు వినేలాగ లేరేమిటి?” అన్నట్టు శ్రీహరిని చూసింది.

శ్రీహరికి ఇంకా ఆశ చావలేదు. ఆ భార్యా భర్తలకి నచ్చ చెప్పే ధోరణితో మళ్ళీ ప్రారంభించాడు — “మీరనేదంతా నిజమేనండీ. మిమ్మల్ని తప్పు పట్ట

డానికి లేదు. ఎవరో ఏదో అంటారని ఆలోచిస్తే ఎలాగ? పిల్ల బతుకు కదా? ఎలాగన్నా ఇది ఆపు కుంటే, సీత కోసం మీరేం చెయ్యమంటే అలాగ చేస్తాం... మీ కన్నా మాకే ఎక్కువ ప్రేమ ఉందని కాదు. ఇప్పుడు ఎలాగ చెయ్యగలమో ఆలోచించాలంతే?"

వెంకన్న విసురుగా లేచాడు — "ఎలాగ చెయ్య గలం? ఎలాగా చెయ్యలేం" అని వసారాలోంచి, పందింట్లోంచి వీధిలోకి వెళ్ళిపోయాడు. జయమ్మ మాట్లాడకుండా నేలచూపులు చూస్తూ ఊరుకుంది.

ఇందిరా వాళ్ళకి ఏం చెయ్యాలో తోచ లేదు. సీత, బల్లమీద నించి లేచినప్పటి నించీ ఏదో ఒక పని చేస్తూనే ఉంది. పిల్లాడికి అన్నం తినిపించి వాకిట్లో నీళ్ళ తొట్టి దగ్గర వాళ్ళు కడిగి భుజంమీద వేసుకుని తిప్పి, మంచం మీద పడుకోబెట్టి చీర గుడ్డ కప్పింది. పెద్ద పిల్లల్ని అన్నాల దగ్గర్నించి లేవదీసి, చేతులూ మూతులూ కడిగి, పళ్ళాలన్నీ తీసింది. పెద్ద ఆరింద లాగ ఒక పని తర్వాత ఒకటి చేసుకుపోతూనే ఉంది.

వెంకన్న కోపంగా లేచిపోయిం తర్వాత జయమ్మ కాస్సేపు బిక్కచచ్చి కూర్చుంది. నెమ్మదిగా తేరుకుని — "సీతా! అత్తమ్మా వాళ్ళకి కాఫీ పెట్టవే" అని సీతని పురమాయించింది.

ఇందిర అడ్డుపడి — "వద్దు, వద్దు జయమ్మా! తాగి వచ్చాం కదా? ఇన్నిసార్లు అలవాటు లేదు. వద్దమ్మా సీతా! పెట్టొద్దు" అంటూ పదిసార్లు చెప్పి ఆ ప్రయత్నం ఆపించింది.

జయమ్మ లేచి లోపలికి వెళ్ళి ఏదో అట్ట పెట్టె తెచ్చి ఇందిర పక్కన బల్లమీద పెట్టింది. అందులోంచి పట్టుచీర తీసి ఇందిర ముందు పట్టుకుని నించుంది. దాని మీద తళతళ మెరుస్తోన్న గొలుసు కూడా ఉంది.

ఆ రెండూ చూస్తే ఇందిరకి కుంగిపోయినట్ట యింది. ఆ వస్తువులకి అంత విలువా? సీతకి అరవై ఏళ్ళ వాడితో పెళ్ళి జరగబోతోందని తెలిసి కూడా, వాటిని చూస్తే తోడబుట్టిన దానికి అంత సంబరమా?

"రాజయ్య గారు మంచి మనిషండీ. సీత కేమి లోటు రానివ్వరు."

ఇందిరకి ఏమనడానికీ తోచలేదు.

సీత కోసం ఇటూ అటూ చూసింది. ముగ్గురు, నలుగురు పిల్లలు ఒకే మంచం మీద పడి నిద్దర్లు పోతున్నారు.

ఇల్లంతా సద్దుమణిగింది.

ఇంకా అక్కడ కూర్చుని చేసేదేమీ లేదు. లేవా లంటే మనసొప్పడం లేదు. ఇంతేనా? ఇంతేనా? ఇంకేమీ చెయ్యలేమా? — అనిపిస్తోంది.

శ్రీహరి నిరుత్సాహంగా — "వెళ్దామా?" అన్నాడు. ఇందిర మాట్లాడలేదు. అలాగే కూర్చుంది.

"సీతా! అత్తమ్మ గారు వెళ్తున్నారు. ఒకసారిలా రా!" అని జయమ్మ చెల్లెల్ని కేకేసింది.

సీత నెమ్మదిగా ఇందిర దగ్గరికి వచ్చింది. బల్లని ఆనుకుని నిలబడి తలవంచేసుకుంది. అంతసేపూ పెద్ద వాళ్ళు మాట్లాడుకున్నదంతా ఆ పిల్ల విన్నట్టే ఉంది.

ఇందిర మౌనంగా సీత చెయ్యి పట్టుకుంది. చేతికివున్న రెండు గాజులూ కాస్సేపు సవరించింది. నెమ్మదిగా భుజం మీద చెయ్యి వేసి మొహంలోకి చూసింది.

ఆ పిల్ల భవిష్యత్తు అంతా ఇందిరకి కళ్ళకి కట్టి నట్టయింది.

నాలుగు రోజుల్లో ఆ పిల్ల ఒక పెద్దాయనకి ఇల్లాలు అవుతుంది. బాల్యం అంతా ముగిసి పోతుంది. ఆ పెద్దాయనకి సేవలు ప్రారంభిస్తుంది. ఆయన ఈ పసి భార్య మీద నిష్కారణ వైరం ప్రారంభి స్తాడు. అనుమానాలు పెంచుకుంటాడు. నించుంటే, నడిస్తే, నవ్వితే, ఏది చేసినా, చెయ్యకపోయినా, కనపడని హింస ప్రారంభిస్తాడు.

ఈ పిల్ల ఓర్చుకుంటుందో, విరక్తి పడుతుందో, నూతికీ గోతికీ పరుగులెత్తుతుందో, ఏం చేస్తుందో!

నెమ్మదిగా గడుసు మీరుతుందేమో!

క్రమంగా బండబారుతుందేమో!

చుట్టు పక్కల మొగవాళ్ళు ఈ అమాయకురాలిని నిలబడనివ్వరు. కూర్చోనివ్వరు. 'వేట' ప్రారంభిస్తారు. ఎక్కడంటే అక్కడ 'ఉచ్చులు' పన్నుతారు.

లొంగిపోతుంది. నాశనమవుతుంది.

సిగ్గుతో, జంకుతో, భీతితో, రోజులు గడుపు కుంటుంది. దారితప్పో తప్పకో ఏదో విధంగా ఒక రిద్దరు పిల్లల్ని కంటే, తనకంటూ ఒక ఇల్లు ఏర్పర్చు

కుంటుంది. లేకపోతే, వారసులు అది ఎత్తుకు పోతారు!

ఆఖరికి ఏం మిగులుతుంది? ఏం అనుభవిస్తుంది?

నాలుగు రోజుల్లో శ్మశానానికి పోబోతున్న పిల్లని పొదువుకున్నట్టు పొదువుకుంది ఇందిర సీతని. ఇందిర కళ్ళల్లోంచి నాలుగు నీటిబొట్లు జలజలా సీత జుట్టుమీద పడ్డాయి, చీకట్లో.

వొంచిన తల ఎత్తలేదు సీత.

ఇందిర సీతని వదిలిపెట్టి, గోడ వేపు తిరిగి కళ్ళు తుడుచుకుంది.

వాళ్ళు బైటికి వెళ్తోంటే వాకిటిదాకా వస్తూ జయమ్మ "మా ఇంట్లో కాఫీ అన్నా తాగారు కారు" అంది.

★ ★ ★

ఇంట్లోకి రాగానే ఇందిర మంచంమీద వాలిపోయింది. జరిగిందంతా శ్రీహరి సుశీలా వాళ్ళకి చెప్పాడు. "సీతతో మాట్లాడాలని చాలాసార్లు అనుకున్నానుగానీ..." అన్నాడు.

"దాని మొహం! అదేం చెప్తుంది?" అంది సుశీల.

"కాదు సుశీలా! అసలు సీతతో మాట్లాడితే ఎలా ఉంటుంది?" అంది ఇందిర. ఓపిక వచ్చినట్టు లేచి కూర్చుంది.

"ఏమిటీ నీ పిచ్చి? పెద్ద వాళ్ళతో మాట్లాడాలనుకున్నారు. మాట్లాడారు. సాయం చేస్తాం — అన్నారు. అంతకన్నా ఏం చేస్తాం? వినకపోతే వాళ్ళ ఖర్మ."

"ఖర్మలూ గిర్మలూ తీసి అవతల పెట్టు. చిన్నపిల్ల బతుకు నాశనమై పోతుంది కదా? సీతతో మాట్లాడాలని చాలా అనిపిస్తోంది ఇప్పుడు. వీలవుతుందా లేదా చెప్పు. అసలు వీలవదా? ఏదన్నా వంక బెట్టి నువ్వు కబురంపితే రాదా?"

"పదయిపోతోంది. ఇప్పుడెలా పిలుస్తాం? వాళ్ళెందుకు పంపుతారు? పంపరు ..... ఒకలాగైతే చెయ్యొచ్చు. రోజూ తెల్లారగట్ల సీతే పాలు తీసుకొస్తుంది మాకు. మా గేది ఈనే దాకా జయమ్మనే పొయ్య మన్నాను. రోజూ చీకట్నే తెస్తుంది."

"ఎన్ని గంట లప్పుడొస్తుంది?"

"నాలుగున్నరా ఐదు అవుతుంది."

"తప్పకుండా సీతే తెస్తుందా? లేకపోతే ఒక్కోరోజు ఎవరన్నా తెస్తారా?"

"ఒకసారెప్పుడో సీతకి జ్వరం వస్తే జయమ్మ తెచ్చింది. అప్పుడు తప్ప, ఎప్పుడూ సీతే వస్తుంది."

"మరి తెల్లారగట్ల దాకా ఆగాలా?"

"ఇప్పు డెలాగూ పది దాటిపోయింది. అన్నాలు తినేప్పటికి పదకొండూ. ఇంకేం వెళ్తారు? ఏకంగా అప్పుడే వెళ్తే సరి."

"ఆగుదామా?" అన్నట్టు చూసింది ఇందిర శ్రీహరి వేపు.

"అంతే మరి. ఈ రాత్రేం పోతాం?" అన్నాడతను.

"సీత తప్పకుండా వస్తుందా? ఏ సావిత్రో తెస్తుందా కొంపదీసి?"

"కాదులే. చిన్న పిల్లలైతే పాలు పారబోస్తారని, సీతతోటే పంపుతుంది జయమ్మ ..... అయినా ఏం మాట్లాడతావు దాంతో? 'ఈ పెళ్ళి నీ కిష్టమేనా' అని అడుగుతావా? 'ఇష్టమే' అంటుందా అది?"

"ఇష్టం కాదంటే? ... అప్పుడేం చేస్తాం?" అన్నాడు శ్రీహరి, ఆలోచనగా.

సుశీల నవ్వి హాస్యంగా — "మీతో పాటు తీసుకుపొండి" అంది.

ఇందిర సుశీల మొహం వేపు అలాగే చూసింది. "అవునే! అలా చేస్తే? సీత వచ్చేస్తానంటే తీసుకుపోతే?"

"అమ్మో! నీతో చాలా ప్రమాదం! ఏదంటే అదే పట్టుకుంటావు."

"కాదులే చెప్పు. తీసుకుపోతే యేం?"

"తీసుకుపోయి?" అని ఆశ్చర్యంగా చూశాడు శ్రీహరి.

"ఉంటుంది మనింట్లో. చదివిస్తాం. తర్వాత ఏదన్నా పనిలో పెడతాం. శశితో పాటే."

అదంతా 'అసాధ్యం' అనిపించింది శ్రీహరికి. "ఇందిరా! ఎమోషనల్‌గా నిర్ణయాలు చేసేస్తే ..... తర్వాత చాలా కష్టం. ప్రాక్టికల్‌గా ఆలోచించాలి" అన్నాడు.

ఇందిర వాదానికి దిగింది. "ఎమోషనల్ ఏమిటి? మనమేం చిన్న వాళ్ళమా? ఆ అమ్మాయిని రక్షించ

డానికి ఎన్ని ప్రయత్నాలు చేశాం గనుక? వాళ్ళ వాళ్ళతో మాట్లాడాం రెండు గంటలసేపు. అంతేనా? ఇంకేమీ ఆలోచించకూడదా? మనమేం చెయ్యగలం — అని వదిలెయ్యడమేనా? ఆ పిల్ల మనల్ని నమ్మి వచ్చేస్తానంటే, ఆ మాత్రం ధైర్యం చెయ్యలేమా? 'డబ్బు' సమస్య లేదు. ఏమిటీ ఇంకా ఇబ్బంది? వాళ్ళ వాళ్ళేమన్నా పోలీసులూ కేసులూ తెస్తారా? అదే ఆలోచించాలి సరిగా. పెళ్ళి చెడిపోతే, ఆ కోపంతో ఆ రాజయ్య అయినా కేసు పెట్టిస్తాడు కదా? పిల్లని మళ్ళీ తీసుకుపోతారనుకో. ఇంతా చేసి మళ్ళీ వాళ్ళకే అప్పజెప్పేలాగైతే ఏం లాభం? అది ఆలోచించాలి బాగా!"

"అసలు సమస్య అది కాదు ఇందిరా! కేసులూ గీసులూ ఎన్నయినా పడతాం. అది సమస్య కాదు... తీరా నమ్మించి తీసికెళ్ళి మనం జాగ్రత్తగా చూడకపోతే అది ఆ అమ్మాయికి ఇంకా బాధ! నీకు పూర్తిగా నమ్మకం ఉందా? శశి ఇష్టపడుతుందా?" అన్నాడు శ్రీహరి.

ఇందిర గాయపడిపోయినట్టు చూసింది. "అంత అర్థం లేకుండా మాట్లాడుతున్నావేమిటి? శశి ఇష్టపడే దేమిటి? మనం చెయ్యాల్సిన పనులన్నీ దాని ఇష్టా యిష్టాల్ని బట్టి చేస్తామా? చేసేది మంచి పని అయితే దానికెందుకు ఇష్టం ఉండదు? అది తెలివి తక్కువగా మాట్లాడితే నచ్చ చెపుతాం. మనం చెప్పినట్టు అది వినాలి, అంతే! దానికి ఇష్టమో కాదో అని జంకుతూ కూర్చుంటామా? చాలా విచిత్రంగా మాట్లాడు తున్నావే! శశి సంగతి తీసుకు రావద్దు! నీకు ఇష్టమో, కాదో చెప్పు, ఫ్రాంక్‌గా చెప్పు! తర్వాత గొడవలు రాకూడదు."

శ్రీహరి నవ్వుతూ — "ఇష్టం కాదంటే నీతో ఇప్పుడే గొడవ వస్తుంది కదా?"

"అవును. బాగా అర్థం చేసుకున్నావు — ఇంత సంకుచితంగా ఉండే మనుషులతో గొడవ పెట్టుకో కుండా ఉండడం నాకు చేతకాదు. చెప్పు హరీ! సీత మనతో వచ్చేస్తానంటే, ఆ అమ్మాయిని రక్షించడానికి నీకేమిటి అభ్యంతరం?"

సుశీలా, శేషగిరీ ఇందిరని నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

శ్రీహరి ప్రశాంతంగా అన్నాడు — "ఇంత మంచి పని మన వల్ల జరుగుతుందంటే నాకు చాలా ఇష్టం ఇందిరా! చాలా ఇష్టం! జాగ్రత్తగా ఆలోచించి చెయ్యా లంటున్నాను, అంతే."

అప్పటికి అంతా ఒక కొలిక్కి వచ్చింది.

సుశీల అన్నాలు వడ్డించింది.

'సీత కోసం ఏదో చేస్తాం' అనుకుంటే ఇందిరకి తేలిగ్గా ఉంది.

"లేనిపోని గొడవ తెచ్చి పెట్టానే ఇందిరా! నే నా ఉత్తరం రాయకుండా ఉంటే పోయేది" అంది సుశీల అన్నాల మధ్య.

"పిచ్చిదానిలాగా మాట్లాడకు. ఇంత మంది ఉన్నాం. అంత చిన్న పిల్లని కాపాడలేమా? ఈ మాత్రా నికి మన ఆస్తులేం తరిగిపోతాయా?" అని కోప్పడింది ఇందిర.

ప్రయాణం ఆగిన సంగతి శశికి తెలీదు. భోజనాల తర్వాత కూడా ప్రయాణ సన్నాహాలు లేకపోయేసరికి "అమ్మా! మనం ఇప్పుడు వెళ్ళడం లేదా?" అని తల్లి దగ్గరికి వచ్చి అడిగింది.

"ఇంతసేపూ ఏం వింటున్నావు? గంట నించి చెప్పుకునేదంతా ఏమిటి? సీతతో మాట్లాడాలని ఆగాం. చీకట్నే బయల్దేరదాం" అంది ఇందిర.

"అమ్మో! నాకు ఎగ్జాముందమ్మా! సెవెన్‌కే కాలేజీలో ఉండాలి" అని ఏడుపు మొహం పెట్టింది శశి.

ఇందిరకి చెప్పలేనంత కోపం వచ్చింది. "ఏవిటి శశీ! చిన్న పిల్లలాగ ప్రవర్తిస్తున్నావు! అవతల ఒక పిల్ల జీవన్మరణ సమస్యలో ఉంటే, ఏమన్నా చెయ్యగలమా అని మేం కిందా మీదా పడుతోంటే, నీకు ఎగ్జామ్ పెద్ద సమస్య అయిపోయిందా? మతి ఉందా పోయిందా? కాస్త కష్టం సుఖం అర్థం చేసుకోవడం నేర్చుకో. చీకట్నే బైల్దేరతాం. టైముంటే వెళ్తవు గాని, లేకపోతే లేదు. నాలుగు మార్కులు తగ్గితే కొంపలు మునగవు."

శశి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. వెళ్ళి శ్యామల పక్కలో పడుకుని నిద్రపోయింది.

పెద్దవాళ్ళు నలుగురూ "ఇప్పుడేం చేస్తాం?" అనుకుంటూ, సమస్యలో పడ్డట్టు కూర్చున్నారు.

దూరంగా ఎక్కడో డప్పుచప్పుడు ఉండీ ఉండీ వినిపిస్తోంది.

ఇందిర ఉలిక్కిపడి "అదేవిటి? పెళ్ళి డప్పు

లేవన్నా పెట్టేశారా?" అంది.

"ఛా! మూర్రోజుల ముందే డప్పులా?" అంది సుశీల.

"ఏమో, ముసిలాడికి ఉత్సాహంగా ఉందో ఏమో" అంది ఇందిర కోపంగా.

"వానల కోసం ఎప్పుడూ ఏదో ఒక మోత చేసుకుంటూ తిరుగుతూనే ఉన్నారు" అంది సుశీల.

"కాదులే, ఏదన్నా చాటింపేమో" అన్నాడు శేషు.

"ఇప్పుడేం చాటింపు, పది దాటిపోతే? అర్ధరాత్రి మద్దిల దరువు."

శేషు నవ్వుతూ — "అన్నట్టు ఇంది రక్కయ్యా, ఒక పని చేస్తే భలేగా ఉంటుంది. రాజయ్య గురించి ఊరంతా చాటింపు వేయించెయ్యాలి" అన్నాడు ఉత్సాహంగా.

"ఇది మరీ బాగుంది. ఊళ్ళో తెలీకపోతే కదా? పెళ్ళిమాట అందరికీ తెలుసు" అంది సుశీల.

"తెలిసినా సరే, 'చూడండి, రాజయ్య ఎలాంటి పని చేస్తున్నాడో, రాజయ్యకి అందరూ గడ్డి పెట్టండహో!' అని చాటించాలి ...... మనం అసలు ఏం చెయ్యాలంటే, ఊళ్ళో అందర్నీ పిలిచి కూర్చోబెట్టి ..... లేకపోతే మనమే అందరిళ్ళకీ వెళ్ళి 'ఇలాంటి పని మనందరం సాగనివ్వటమేనా' అని అందరితోటీ మాట్లాడాలి. లేకపోతే అందరం వెళ్ళి రాజయ్య ఇంటి చుట్టూ మూగి 'ఇదేం పనిరా? మనిషివా, దున్నపోతువా?' అని అరవాలి. అరవడానికి రమ్మంటే బోలెడు మంది పిల్లలొస్తారు" అన్నాడు శేషు గబగబా.

ఇందిరకీ శ్రీహరికీ కూడా పత్రికల్లో రోజూ చూసే నిరసనలూ ధర్నాలూ కర పత్రాలూ అన్నీ గుర్తొచ్చాయి.

"అవును, ఒక కాయితం ప్రింటు చేయించి ఊళ్ళో ఇంటింటికీ పంచాలి" అన్నాడు శ్రీహరి కొత్త ఉత్సాహంతో.

"మళ్ళీ మొదటికొస్తారేమిటి? ఊళ్ళో ఎవరికి తెలీదని?" అంది సుశీల విసు క్కుంటూ.

"తెలీదనికాదు, రాజయ్యకి గడ్డిపెట్టి పెళ్ళి ఆపించాలని రాస్తాంగా అందులో?" అన్నాడు శ్రీహరి. "ఊళ్ళో గందరగోళం అవు తుంది. వాడు తప్పకుండా భయపడతాడు" అన్నాడు మళ్ళీ.

ఇందిర ఆలోచనల్లోనించి బయటపడి — "ఆ పనులన్నీ పెట్టుకుంటే పుణ్యకాలం కాస్తా పోతుంది. ఆ పిల్లని వాళ్ళు ఏ అన్నవరమో సింహాచలమో తీసుకుపోతారు. ముందు పిల్లనెలా రక్షించాలో ఆలోచించాలి గాని..." అంది.

'అదీ నిజమే' అనిపించింది అందరికీ.

"అయినా నాకు ఈ వారంలో చాలా ఆపరేషన్లున్నాయి. అన్నీ ఫిక్సయిపోయాయి. ఈ కరపత్రాలూ ప్రచారాలూ ఎలా చెయ్య గలం? అంత టైమేదీ?" అని చాలా నిరుత్సాహ పడింది ఇందిర.

"ఫర్వాలేదు. ఫలితం ఉంటుందంటే ఏదో వొకటి చెయ్యొచ్చు. కానీ వాళ్ళకి వ్యతి రేకంగా ఎవరో ఏదో చేస్తున్నారని వాళ్ళు పసికడితే నిజంగానే ఆ పిల్లని ఎటన్నా తీసుకుపోతారు. రహస్యంగా జరిగితేనే మంచిది" అన్నాడు శ్రీహరి.

ప్రచారం సంగతి అసాధ్యమనిపించింది.

శేషుకి ఉత్సాహం అణగకపోయినా — "నిజమేలే. సీతని రహస్యంగా తీసుకు పోతేనే మంచిది. అప్పుడే తెలిసొస్తుంది రాజయ్యకి" అన్నాడు.

ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడారు. తర్జన భర్జనలు చేశారు. మాట్లాడుకుంటూనే కూర్చున్నారు. ఎలా జరుగుతుందోనని అందరికీ జంకుగానే ఉంది. నెమ్మదిగా ఒక్కొక్కళ్ళూ నిద్రలకి పడ్డారు.

★ ★ ★

**ఇం**దిర గంట గంటకీ లేచి గడియారం చూస్తోనే ఉంది. ఆఖరిసారి మూడింటికి లేచింది. సుశీలని లేపేసింది.

"అప్పుడే కాదే" అంటూ సుశీల మళ్ళీ నిద్రలోకి జారింది.

నాలుగు దాటుతోంటే ఇందిర ఒక్కతే బయట వరండాలో కూర్చుని వీధికి కళ్ళు అప్పగించేసింది.

తెల్లారగట్ల వెన్నెల ఎంత చల్లగా ఉందో! వీధి అంతా ఎంత నిశ్శబ్దంగా ఉందో! పల్లెటూళ్ళో గడిపి ఎంత కాలమై పోయిందో!

ఉలిక్కిపడి టైమ్ చూస్తే నాలుగున్నర దాటి పోయింది! ఇందిరకి కంగారెక్కువయ్యింది.

హఠాత్తుగా సీత పాల తెపాళాతో వరండాలో ప్రత్యక్షమైంది!

ఇందిర తన కళ్ళని తను నమ్మలేకపోయింది. "సీతా! నువ్వేనా?" అంది ఎదురువెళ్తూ.

సీత ఆశ్చర్యపోతూ — "మీరు వెళ్ళిపోలేదా అత్తమ్మా?" అంది.

"నీ కోసమే, నీతో మాట్లాడాలనే ఉండిపోయాం సీతా! నిజం చెప్పు. ఈ పెళ్ళి చేసుకోనని చెప్పావా నువ్వు?" అని ఇందిర సూటిగా ఆ మాటే ఎత్తింది.

సీతకి ప్రాణం లేచి వచ్చింది. ఆ క్షణంలో ఆ పిల్లకి, ఇందిర మీద చెప్ప లేనంత నమ్మకం కలిగింది. తన పెళ్ళి గురించి ఎవరూ అలా మాట్లాడడం ఆ పిల్ల అప్పటిదాకా చూడలేదు.

"ఎన్నిసార్లు చెప్పానో అత్తమ్మా! మా అక్క ఏమిటేమిటో చెప్తోంది."

"ఈ పెళ్ళి నిజంగా ఇష్టం లేదా నీకు?"

"ఛీ ఛీ! అస్సలు ఇష్టంలేదు. ఒట్టు! ఆ రాజయ్య చాలా చెడ్డ వాడంట అత్తమ్మా!"

"మంచివాడైనా, అంత వయసు తేడా తప్పమ్మా!"

సీత ఏడుపు మొహం పెట్టేసింది.

"మరి మాతో వచ్చేస్తావా?"

"మీతోనా! ఎక్కడికీ?"

"మా ఊరూ! మా ఇంటికీ! మా దగ్గరే ఉండి పోదువుగాని. నిన్ను స్కూల్లో చేర్పిస్తాం. లేకపోతే, నా దగ్గిర పని నేర్చుకుందువుగాని. నేను డాక్టర్నీ. తెలుసా? మావయ్య కూడా డాక్టరే. చెప్పు, మాతో వచ్చేస్తావా?"

సీత ఏడవడం మొదలుపెట్టింది — "మా అక్క పంపదు. మా అక్క పంపదు" అంది.

"అది కాదమ్మా! మీ అక్కకి చెప్పొద్దు. ఇప్పుడే వెళ్ళిపోదాం."

"వాళ్ళకి తెలిస్తే? నన్ను మళ్ళీ తీసుకుపోతారు."

"తీసుకుపోరు. తీసుకుపోనివ్వం. అదంతా మేం చూస్తాంగా! మాతో వచ్చెయ్యడం నీ కిష్టమేనా చెప్పు."

"ఇష్టమే అత్తమ్మా! ఇష్టమే... కానీ..."

"భయం వేస్తోంది కదూ? ఏం ఫర్వా లేదమ్మా! ఇలా తెగించకపోతే ఈ ఆపద తప్పదు నీకు. నా మాట విను. నీ కేమీ కష్టం రానివ్వను. జాగ్రత్తగా చూసు కుంటాను. ఇష్టమే కదా? వెళ్ళిపోదామా మరి? కొన్నా ళ్ళకి మీ అక్కకి కోపం తగ్గిపోతుంది. అప్పుడు నువ్వు ఇక్కడికి వస్తూ పోతూ కూడా ఉండొచ్చు. తర్వాత నిన్నెవరన్నా అడిగితే, నీ ఇష్టం మీదే వచ్చేశానని చెప్పాలి. తెలిసిందా?"

"అలాగే చెపుతాను. నన్ను నిజంగా తీసుకుపోండి అత్తమ్మా! మీ ఇంట్లో ఏ పని చెప్తే ఆ పని చేస్తాను. నన్ను మీ దగ్గిరే ఉంచుకోండి అత్తమ్మా!" అంటూ సీత ఇందిరని కావిలించేసుకుని మళ్ళీ ఏడవడం మొదలు పెట్టింది.

అప్పటికే అందరూ లేచారు.

శ్రీహరి కారు తీసి రోడ్డు మీద పెట్టాడు. శశి, వెనక సీట్లో కూర్చుంది. ఇందిర, సీతని కారు దగ్గిరికి తీసుకెళ్ళి శశి పక్కన కూర్చో బెట్టింది. శశి ఒక మూలకి జరిగి, "సీతా పడుకో, ఎవరన్నా చూస్తారు. పడుకో" అని తొందరపెట్టింది.

సీత చప్పున సీట్లో ముడుచుకుని పడుకుని ఓణీ తీసి తలనిండా, చేతులనిండా కప్పేసుకుంది.

ఇందిర సంతోషంతో పొంగిపోతూ "సంగతేమిటో చూద్దామని వచ్చాం. పెళ్ళి కూతుర్ని ఎత్తుకు పోతున్నాం. పాపం పెళ్ళి కొడుకేమైపోతాడోనే సుశీలా" అంటూ ముందు సీట్లో కూర్చుని డోరు వేసేసింది.

"ఇంకేమైపోతాడు? దుఃఖ సముద్రమే" అని నవ్వాడు శ్రీహరి.

"ఏమో బాబూ! మీ దారిన మీరు పోతున్నారు. జయమ్మా వాళ్ళు మా మీదకి పెద్ద యుద్ధానికొస్తారు" అంది సుశీల భయపడుతూ.

"మాకేం తెలుసు అందాంలే. మనమూ చేద్దాంలే యుద్ధం. తొందరగా వెళ్ళండి" అని తొందరపెట్టాడు శేషగిరి.

కారు కదిలి, తెల్లారగట్ల వెన్నెట్లో, చల్లగాలి పోసుకుంటూ నిశ్శబ్దంగా సాగిపోయింది.

★ ★ ★

ఇంటికి చేరేటప్పటికి ఏడు దాటింది.

"సీతని ఇంట్లోనే ఉంచుదామా? ఎక్కడన్నా దాచి పెడదామా నాలుగు రోజులు?" అని కార్లోనే ఆలో చించారు.

"ఏం పర్వాలేదు. మనతోనే ఉంటుంది. వాళ్ళొచ్చి రమ్మంటా రనుకో. ఇది రానంటే సరిపోతుంది. నాలుగు తిట్లు తిట్టిపోతారు. అంతకన్నా ఏం చేస్తారు?" అన్నాడు శ్రీహరి.

"వాళ్ళేమీ చెయ్యలేరని అంత అతి నమ్మకం

పనికి రాదు మనకి" అని వాదించింది ఇందిర.

"నాలుగు రోజుల తర్వాతైనా మనింట్లోనే ఉంటుంది కదా? అదేదో ఇప్పుడే ఫేస్ చేద్దాం" అన్నాడు శ్రీహరి.

ఎటూ తేల్చుకోకుండానే ఇంటికి చేరారు.

శశి హడావుడిగా కాలేజీకి పరిగెత్తింది.

"మీ అక్కా బావా వస్తారనుకో, ఇంటికి రమ్మంటా రనుకో. ఏం చెపుతావు?" అని సీతని ప్రశ్న లడిగారు.

సీత అన్నిటికీ ధైర్యంగా చెప్పింది.

"అత్తమ్మ గారి ఊరు చూద్దామని వచ్చా నంటాను" అంది మొదట.

ఇందిర నవ్వి — "అలా కాదే పిచ్చిదానా! అసలు సంగతే చెప్పెయ్యాలి" అంది.

సీత కూడా నవ్వి — "నాకు బలవంతంగా పెళ్ళి చేస్తున్నారు కాబట్టి నా కిష్ట మొచ్చిన చోటుకి వచ్చేశా నంటాను" అంది.

"సెభాష్! అలా మాట్లాడాలి. ఓ పది మంది వచ్చే స్తారనుకో. నిన్ను లాక్కుపోయి కార్లో పడేసి తీసుకు పోతారనుకో. అప్పుడేం చేస్తావు?"

"తీసుకు పోయినాసరే పెళ్ళి పీటల మీద కూర్చోనత్తమ్మా! అతను కూర్చుని ఉంటాడు కదా? అక్కడికి వెళ్ళి చెప్పేస్తాను — 'నిన్ను చేసుకోను. నీకు అరవయ్యేళ్ళు. నాకు పధ్నాలుగేళ్ళు. నేను చేసుకోను' అని చెప్పేస్తాను" అంది.

"అంతేకాదు, 'నీకు సిగ్గు లేదా తాతా' అనాలి. ఆ మాట కూడా అంటావా, మర్చిపోతావా?"

"ఆఁ, తప్పకుండా అంటాను. మా అక్క తిట్టినా సరే, కొట్టినా సరే, చంపేసినా సరే!"

"పిచ్చిదానా! అంత పని జరగదులే."

సీత ఇప్పుడు ధైర్యంగా ఉందన్రా — అని తేలిక పడ్డారు ఇందిరా, శ్రీహరీ.

సీతని ఎక్కడా దాచనక్కరలేదని నిర్ధారించారు.

లెక్క ప్రకారం ఇంకా మూడు రోజులుంది పెళ్ళి.

ఇందిర బయటికెళ్ళడం మానేసింది. ఆపరేషన్లన్నీ వాయిదాలు వేసేసింది. శ్రీహరి కూడా ఇలా వెళ్ళి అలా వచ్చేస్తున్నాడు.

శశి కూడా కాలేజీ ఎగ్గొట్టేసింది.

ఏ నిమిషం ఏం జరుగుతుందోనని అందరూ ఎదురుతెన్నులు చూస్తూ గంటలు గడుపుతున్నారు.

రెండు రోజులు గడిచిపోయింది — ఏమీ జరగ కుండానే! ఎవ్వరూ రాలేదు. సుశీల దగ్గర్నించి కూడా ఏ కబురూ లేదు!

ఏమీ జరగకపోవడం మరీ ఆందోళనగా ఉంది.

"ఏదన్నా జరిగితేనే బాగుండును" అంది ఇందిర చాలాసార్లు.

"అమ్మా! సీత ఎంత మంచిదోనే" అని శశి రెండు మూడు సార్లు సీతని మెచ్చుకుంది తల్లి దగ్గర.

"ఎందుకు?" అని తల్లి అడిగితే, శశి చెప్ప కొచ్చింది — "ఎప్పుడూ నా పుస్తకాలో, బట్టలో సర్దు తూనే ఉంటుంది. ఇందాక నేను తడి టవలు మంచం మీద పడేసి మర్చిపోతే తనే తీసుకెళ్ళి ఆరేసింది. నేను తల దువ్వుకోబోతోంటే తనే దువ్వెన లాక్కుని తల దువ్వింది. నేను చదువుకుంటూ ఉంటే అలా చూస్తూ కూర్చుంటుంది. నువ్వు అస్తమానూ అంటావే 'కుదు రుగా ఉండాలి, కుదురుగా ఉండాలి' అనీ. అచ్చంగా అలాగే ఉంటుంది. నెమ్మదిగా మాట్లాడుతుంది. నెమ్మదిగా నడుస్తుంది. నెమ్మదిగా నవ్వుతుంది..."

కూతురు మాట్లాడుతోంటే ఇందిర నవ్వుతూ వింది — "మంచిదే. సీతని చూసి నేర్చుకో మరీ. 'కుదురుగా ఉండడం' అంటే నెమ్మదిగా నడవాలనీ, నెమ్మదిగా నవ్వాలనీ, నెమ్మదిగా మాట్లాడాలనీ కాదు. సీత అలాగ ఎందుకు ఉందంటే, అది 'అణుకువ'. దానికి చిన్నప్పటి నించీ తల్లి లేదు. అక్క ఇంట్లో చాకిరీ చేస్తూ పెరిగింది. అణుకువగా ఉండడం అలవాటై పోయింది. నిన్ను అలాగ అణిగి మణిగి ఉండమని కాదు నేననేది. కుదురుగా ఉండడం అంటే, అలా అర్థం చేసుకోకు.

సీత మనింటికి వచ్చిందంటే మనం పరాయి వాళ్ళమే కదా? తనని ఆదుకున్నామనే కృతజ్ఞతతో అలా ప్రవర్తిస్తోంది. అదంతా దాని మంచితనం. మరి మనం కూడా మంచిగా ఉండాలి కదా? సీతని మనం 'పని పిల్లలాగ' అనుకోకూడదు. నువ్వు ఖాళీగా కూర్చుని నీ పనులు దానితో చేయించుకోకూడదు. ఎప్పుడూ దాన్ని చిన్నబరచకూడదు."

శశి అన్నీ కుదురుగా వింది.

ఇందిర నవ్వి — "సీత చాలా మార్చింది

నిన్ను" అంది.

శశి సీతతో స్నేహంగా ఉండడం ఇందిరకెంతో హాయిగా ఉంది.

★ ★ ★

ఆ రోజే పెళ్ళి రోజు! అదే, పెళ్ళి ఆగి పోవాల్సిన రోజు! ఉదయం 'పది' దాటితే చాలు, సీతకి పీడ వదిలినట్టే! ముహూర్తం దాటిపోతుంది!

అర్జంటు కేసులున్నాయనీ, వెళ్ళక తప్పదనీ శ్రీహరి వెళ్ళిపోయాడు.

ఇందిరకి క్షణమొక యుగంగా గడిచిందా పగలంతా. కళ్ళు రెండూ రోడ్డుకి అప్పజెప్పేసి శ్రీహరి కోసం ఎదురుతెన్నులు చూస్తూ గడిపింది.

కారు దిగి నిరుత్సాహంగా లోపలికి వస్తోన్న శ్రీహరిని చూస్తే "అలా ఉన్నాడేమిటి?" అనిపించింది ఎందుకో.

"చాలా ఘోరం జరిగిపోయింది ఇందూ!" అంటూ నిలబడే శక్తి లేనట్టు కుర్చీలో కూర్చుని వెనక్కి వాలాడు శ్రీహరి.

"ఏమిటి?" అని అడగడానికి కూడా నోరు రానంత భయం వేసింది ఇందిరకి.

"రాజయ్య పెళ్ళి ఆగిపోయిం దనుకున్నాం కదా? ఆగలేదు."

"ఆగలేదా?" అర్థం కాలేదు ఇందిరకి.

"సీత... ఇక్కడే ఉంది కదా?"

"ఇంకా అక్కడ లేరా సీతలు? పొద్దున్న ముహూర్తానికే పెళ్ళయి పోయిందట! 'సావిత్రి'తో!"

"సావిత్రితోనా! సావిత్రితోనా! జయమ్మ కూతురితో! ఎంత ఘోరం!" నిర్ఘాంతపోయి నిలబడి పోయింది ఇందిర.

"అదే. వినగానే తల తిరిగిపోయింది నాకు."

"ఎవరు చెప్పారు నీకు? ఎవరు చెప్పారు? వాళ్ళకెలా తెలుసు?"

తను విన్నదంతా చెప్పుకొచ్చాడు శ్రీహరి. పెళ్ళిలో వాయించడానికి బ్యాండు మేళం కావాలంటే, మేళం వాళ్ళంతా ఒక వ్యాన్‌లో ఆ ఊరు వెళ్ళారు. మధ్యాహ్నానికి అందరూ తిరిగి వచ్చారు. పెళ్ళిలో తారాజువ్వలూ, బాంబులూ బాగా పేల్చారు. బ్యాండు మేళంలో పుల్లారావనే అబ్బాయికి చేతికి గాయం అయింది. అతను శ్రీహరి ఆస్పత్రికి వచ్చాడు. 'దెబ్బ ఎలా తగిలింద'ని అడిగితే అతనా పెళ్ళి కబుర్లు చెప్పుకొచ్చాడు. ఆ ఊరు పేరే! ఆ మనిషి పేరే! ఆ వివరాలన్నీ చెప్పాడు!

ఆ పెళ్ళి జరిగిపోయిందని నిర్ధారణ అయిపోగానే శ్రీహరి పుల్లారావుని బాగా తిట్టాడు. "అరవై ఏళ్ళవాడు, పన్నెండేళ్ళ పిల్లని పెళ్ళి చేసుకుంటూ ఉంటే మీరందరూ బాజాలు వాయిస్తూ నించున్నారా? ఛీ! అంతకన్నా అడుక్కుతినడం మంచిది" అన్నాడు.

"ఆ ఊరు పోయేదాకా ఆ పెళ్ళి వివరాలు తెలీవ"ని పుల్లారావు గోలపెట్టాడు.

"వెళ్ళాక తెలిసింది కదా? ఛీ! ఇలాంటి పెళ్ళికి మేం వాయించం—అని వచ్చెయ్యాలి కదా?" అన్నాడు శ్రీహరి.

పుల్లారావు తెల్లబోయాడు. "ఆ ఆలోచనే రాలేదయ్యా! అలా చేస్తే ఎంత బాగుండేదో! మా వాళ్ళంతా వచ్చినా రాకపోయినా నేనైనా వచ్చేసేవాణ్ణి" అని అతను వందసార్లు అన్నాడు. అలా చెయ్యలేక పోయినందుకు ఏడ్చినంత పని చేశాడు.

ఆ తర్వాత, అతను డాక్టరు గారికి పెళ్ళి కబుర్లు చాలా చెప్పాడు.

పెళ్ళి పందిరి, జనంతో కిట కిట లాడి పోయిందట! 'మొగాడికి ముసలితనం ఏంట'ని కొందరూ, 'ఆడపిల్ల ఎంతలో ఎదిగొస్తుంద'ని కొందరూ, చెప్పుకున్నారట! అక్కడన్నీ అలాంటి ముచ్చట్లే గానీ," 'ఛీ! ఇదేం పని' అన్న వాళ్ళెవరూ కనపళ్ళేదయ్యా" అని గోల పెట్టాడు పుల్లారావు.

ఆడవాళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదట! పట్టు చీరలూ, జరీచీరలూ చుట్టుకుని, తలలనిండా ఇంతింత పూలదండలు వేళ్ళా దేసుకుని, కాళ్ళకి పసుపులూ గిసుపులూ పూసుకుని, పెళ్ళికూతురు మీదా, పెళ్ళి కొడుకు మీదా ఎగిరెగిరి అక్షింతలు విసరడం అట!

"అబ్బ! చెప్పకు..." అంది ఇందిర కుంగిపోతూ.

శశి లోపల్నించి "అమ్మా! సీత ఏడుస్తోంది" అని పరుగెత్తుకొచ్చింది.

"ఎందుకూ? ఎందుకూ?" అని ఇందిరా, ఆ వెనకే శ్రీహరీ కంగారుగా వెళ్ళారు.

సీత నేలమీద పడి భోరుమని ఏడుస్తోంది.

సీతని అలా చూస్తే ఇందిరకి గుండె నీరై పోయింది. "ఏమిటే సీతా ఇదీ, పిచ్చిదానా! నువ్వేడుస్తా వెందుకే?" అని ఇందిర సీతని ఒళ్ళోకి తీసుకో బోయింది.

సీత రెక్కలు తెగిపడ్డ పిట్టలాగ కొట్టుకుంటూ "సావిత్రి నా కన్నా చిన్నది, నాకన్నా చిన్నది, నేనే చేసుకుంటే బాగుండేది అత్తమ్మా! నన్ను పంపెయ్యి! ... పంపెయ్యి ...... వాళ్ళ ఇంటికి నేనే వెళ్తాను. సావిత్రి వొద్దు. నన్ను పంపెయ్యి అత్తమ్మా!" అంటూ పెద్ద కంఠంతో ఏడ్చింది.

ఇందిరకి కళ్ళల్లోంచి జలజలా కన్నీళ్ళు రాలి పోయాయి. "లేదమ్మా సీతా! ఏం చెయ్యాలో ఆలో చిద్దాం! ఏడిస్తే ఏం లాభం చెప్పు? సావిత్రిని కూడా తెచ్చేద్దాం. తప్పకుండా తెచ్చేద్దాం. సరేనా?"

"అప్పుడు రేవతి నిచ్చి చేసేస్తుంది మా అక్క, అత్తమ్మా! నేనే వెళ్తాను. నన్ను పంపెయ్యి!"

"అసలు ఆ వెధవ మీద పోలీసులకి చెప్పేస్తాను నేనే. వాణ్ణి జైల్లో పెట్టించేస్తాను! పోనీ కదా అని ఇన్నాళ్ళూ ఊరుకున్నాను. ఇలాగ చిన్న పిల్లల్ని పెళ్ళిళ్ళు చేసుకుంటూ ఉంటాడా వెధవ? ఇప్పుడే వెళ్ళి చెపుతాను పోలీసులకి. నువ్వు లే ముందు. లేచి కూర్చో! పెళ్ళి చేసుకోగానే సరిపోయిందనుకుంటున్నా డేమో, సావిత్రిని కాపరానికి వెళ్ళకుండా చేద్దాం. నీ కెందుకు? అదంతా నేనూ, మావయ్యా చూస్తాం కదా? వాణ్ణి వదిలిపెడతా మనుకున్నావా? శశీ! సీతకి ఏమన్నా తాగడానికి తీసుకురా. వేడిగా పాలు గాజు గ్లాసుతో తీసుకురా! లేమ్మా సీతా! నా మాట వినవూ?'

సీత దిగ్గున లేచింది. "అత్తమ్మా!" అని మళ్ళీ ఏడ్చింది.

తల్లి మాటలు అర్థం చేసుకున్న శశి అలమారులో నించి చిన్న నిద్ర మాత్ర తీసుకుని వంటింట్లోకి పరుగెత్తి గాజు గ్లాసులో పాలు తెచ్చింది.

సీత వెక్కిళ్ళతో పాలు తాగింది.

ఇందిర చాలా సేపు అక్కడే కూర్చుని — "శశీ! ఇద్దరూ కాసేపు పడుకోండి" అని, సీత మంచం ఎక్కాక ఆ గదిలోంచి బయటికి వచ్చింది.

కాసేపటికి వచ్చి చూస్తే సీత ప్రశాంతంగా నిద్రపోతోంది.

ఇందిరా, శ్రీహరీ 'ధర్మయుద్ధం'లో ఓడిపోయిన వాళ్ళలాగా కూర్చున్నారు.

మాట్లాడుకోడానికేమీ మాటలు లేనట్టు ఎంత సేపో మౌనంగా కూర్చున్నారు.

ఇందిర, ఆ రాత్రి జయమ్మా వాళ్ళింట్లో చూసిన సావిత్రిని జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

సావిత్రి ఎంతసేపూ సీత — పిన్నిని ఆనుకునే నిల బడింది. ఓణీ కూడా లేదు. మొహంలో పసితనమే వదల్లేదు.

చేతుల్నిండా గోరింటాకు పెట్టుకుంది. బాగా పండాలని ఇంకా కడుక్కోకుండా ఉంచుకుంది. బాగా పండితే మంచి మొగుడొస్తాడని!

"సావిత్రి గుర్తుందా?" అంది ఇందిర శ్రీహరిని చూస్తూ నిరుత్సాహంగా.

"అందరూ గుర్తున్నారు" అన్నాడు శ్రీహరి విరక్తిగా.

ఇందిరకి భరించలేనట్టుగా ఉంది.

"అబ్బా... ఏం పనిచేశాం!" అని తల పట్టుకుంది. కళ్ళు నిండిపోయాయి! ఏడుపుని ఆపుకోడానికి ప్రయత్నించలేదు.

"సీతని రక్షించాం.

కానీ, సావిత్రిని బలి ఇచ్చి!"

సావిత్రిని తప్పిస్తే రేవతినీ, రేవతిని తప్పిస్తే స్వాతినీ, స్వాతిని తప్పిస్తే... ఇంకా ఎంత మంది ఆడ పిల్లలు లేరు! ఎన్ని బికారి కుటుంబాలు లేవు! ఈ బికారి బతుకుల్లో నించి ఎవరు ఎవర్ని రక్షించగలరు?

[27-7-1994 'ఆంధ్రప్రభ' వారపత్రికలో] ★

**ఈ కథ గురించి:**

ఈ కథ మొదటిసారి పుస్తకంగా వచ్చినప్పుడు దీన్ని గురించి రాసిన మాటలే (18-11-1996) ఇక్కడ ఇస్తున్నాను — "ఇందిరా, శ్రీహరీ అనే భార్యాభర్తలు (ఇద్దరూ డాక్టర్లు), తమ అనుభవంగా ఈ సంఘటన చెప్పారు. అందులో మార్చేదీ చేర్చేదీ ఏమీ లేకుండా జరిగిందే ఒక కథ అయింది!" ★